క్లుప్తంగా

ముగిసిన దస్తగిరి స్వామి ఉరుసు

ఆస్పరి: ములుగుందం గ్రామంలో వెలసిన దస్తగిరి స్వామి 267వ ఉరుసు ఉత్సవాలు గురువారం జియారత్‌తో ముగిశాయి. మూడవ రోజు దస్తగిరి స్వామి గుర్రాన్ని గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు స్వామి గుర్రానికి పూజలు చేశారు. ముస్లింలు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

క్రీడాకారిణికి ఆర్థిక సాయం



కైరుప్పలలో క్రీడాకారిణి వెంకటలక్ష్మికి ఆర్థిక సాయం చేస్తున్న గిడ్డయ్య

ఆస్పరి:పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించిన వెంకటలక్ష్మిని ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య సూచించారు. గురువారం మండలంలోని కైరుప్పల గ్రామంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వెంకటలక్ష్మికి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆమెను శాలువా, పూలమాలలతో సన్మానిస్తూ సీపీఐ తరఫున రూ.23 వేలు ఆర్థిక సాయం అందించారు. అతిథులు మాట్లాడుతూ అంతర్జాతీయ పోటీల్లోనూ వెంకటలక్ష్మి రాణించాలని ఆకాంక్షించారు. నాయకులు శరవన్న, విరుపాక్షి, రమేష్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటుకు విరాళం

ఆలూరు: మండల కేంద్రానికి మూడు కి.మీ దూరంలో బెళ్లగుండ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న 54 అడుగుల హనుమాన్ విగ్రహానికి రిటైర్డు డిప్యూటీ తహసీల్దార్ హెచ్.మహారుద్రగౌడు, ఆయన సతీమణి సిద్దమ్మ రూ 60,500 విరాళాన్ని గురువారం ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. తన తండ్రి స్వర్గీయ విరుపాక్షి గౌడు జ్ఞాపకార్థం విరాళం అందించినట్లు దాత తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు దాతను సన్మానించారు. శ్రీనివాసరెడ్డి, గౌడు, బీఎస్ఆర్, నాగేంద్రయ్య ఉన్నారు.

నీటిని వృథా చేయరాదు

మద్దికెర: తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని పంచాయతీ కార్యదర్శి సుధాకర్ సూచించారు. గురువారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో నీరు వృథాగా పోతున్న కొళాయిలకు బిరడా ఏర్పాటు చేయడం, మరమ్మతులు చేయించి నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించారు. రానున్న వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడైనా బోర్లు చెడిపోతే వెంటనే సచివాలయంలో తెలియజేయాలని సూచించారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి చూపండి

చిప్పగిరి: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మండలంలోని జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని హౌసింగ్ డీఈ ఆదినారాయణ గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై ఆ శాఖ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. డీఈ మాట్లాడుతూ.. గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. నిర్మాణాల్లో ఉన్న ఇళ్లకు దశల వారీగా ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ సుధాకర్ రాజు, ఏఈ భవ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 2న బడేసాబ్ ఉరుసు

ఎమ్మిగనూరు: శ్రీ వరసిద్ధి పద్మ సద్గురు బడేసాబ్ ఉరుసు మహోత్సవం మార్చి 2న నిర్వహించనున్నట్లు ధర్మకర్త సుకన్యదేవి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కోసిగి రోడ్డులో వెలసిన బడేసాహెబ్‌తాత ఉత్సవాల్లో భాగంగా మార్చి 1న గంధం, 2న ఉరుసు, 3న జియారత్ ఉంటుందని పేర్కొన్నారు.

రెండు రోజుల్లో 110 కేసులు

గోనెగండ్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో 110 మందిపై పెట్టి కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఆయన గురువారం తన సిబ్బందితో గోనెగండ్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లపై అడ్డంగా ఉండి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పరచడం, బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్, మద్యం సేవించడం, రోడ్లపై మురుగు నీరు చల్లడం, చెత్తచెదారం వేసిన వ్యక్తులపై గురువారం ఒక్కరోజే 70 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయా కార్యకాలాపాలను కట్టడి చేసేందుకు గత రెండు రోజుల నుంచి మండలంలో మొత్తం 110 మందిపై పెట్టి కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఎవరైనా ప్రజలకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

'విదేశీ విద్య' వర్తింపజేయాలి

గోనెగండ్ల: బడుగు బలహీన వర్గాల వారి కోసం ప్రవేశపెట్టిన విదేశీ విద్య పథకాన్ని అర్హులందరికీ వర్తింపజేయాలని టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు రమేష్ నాయుడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ దినేష్‌కు వినతిపత్రం అందజేశారు. విదేశీ విద్యా పథకంలో ఎలాంటి ఆంక్షలు విధించకుండా అర్హులందరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ.. నూతన ఒరబడి

- ఆంగ్ల మాధ్యమంలో ప్రీ స్కూళ్ల ఏర్పాటు
- ఆటపాటలతో కూడిన విద్య
- బొమ్మలతో చిన్నారులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన



చిన్నారులకు పాఠ్యాంశాలు బోధిస్తున్న అంగన్‌వాడీ టీచర్

గోనెగండ్ల: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో వినూత్న మార్పులు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు పిల్లలకు మెరుగైన విద్యాబుద్ధులు నేర్పేందుకు ప్రీస్కూళ్లను ఏర్పాటు చేసింది. ఆ దిశగా అంగన్‌వాడీ టీచర్లను తీర్చిదిద్ది వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. దీంతో వారు ఆటపాటల ద్వారా చిన్నారులను తీర్చిదిద్దుతున్నారు.

ప్రత్యేక సిలబస్

మండలంలో గోనెగండ్ల, హెచ్. కైరవాడి సెక్టార్లలో 68 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. మూడు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులు సుమారుగా 1,490 మంది చిన్నారులు ఉన్నారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రీస్కూళ్ల కోసం ప్రత్యేక ప్రణాళికలు, సిలబస్ రూపొందించింది. ఈ మేరకు అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం ప్రీ స్కూల్ కిట్లను అందించింది. వీటితో టీచర్లు సొంతంగా బొమ్మలు తయారు చేసి చిన్నారులకు విద్య బోధన చేస్తున్నారు. వివిధ రకాల బొమ్మలు చిన్నారుల ముందుంచి చెప్పడం వలన వారికి సులభంగా అర్థమవుతుంది. తద్వారా అభ్యసనకు వారు ఆసక్తి చూపడంతో పాటు, విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నారు.

ఆంగ్ల మాధ్యమంలో చదువు

ప్రభుత్వం ప్రీ ప్రైమరీ నుంచి అంగన్‌వాడీలను ఇంగ్లిష్ మీడియం పాఠశాలలుగా తీర్చిదిద్దింది. ఈ మేరకు టీచర్లకు ప్రత్యేక శిక్షణ అందిస్తోంది. దీంతో టీచర్లు ఆంగ్లంపై ఆసక్తి కలిగేలా చిన్నారులను ప్రేరేపిస్తున్నారు.

బొమ్మల తయారీలో అంగన్‌వాడీలకు శిక్షణ

ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాల్లో భాగంగా బొమ్మల తయారీకి అవసరమైన చార్టులు, రంగు పెన్సిళ్లు, స్కెచ్‌లు, రబ్బర్లు తదితర సామగ్రిని ప్రభుత్వం సమకూర్చింది. వీటి వినియోగంపై సూపర్‌వైజర్లకు ఇప్పటికే స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. చిన్న చిన్న వస్తువులను ఉపయోగించి వస్తువులు, అంకెలు, పండ్లు, కూరగాయలు, పక్షులు, జంతువులు వివిధ రకాల వాహనాల బొమ్మలను తయారు చేసి, వాటితో కథల ద్వారా చిన్నారులకు చదువుపై దృష్టి మళ్లేలా చర్యలు చేపడుతున్నారు. అంతేకాకుండా అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రతినెలా ఆయా సెక్టార్ల ప్రాజెక్టు పరిధిలో ఐసీడీఎస్ అధికారులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక యూట్యూబ్ ఛానెల్ కూడా రూపొందించింది.

సృజనకు శ్రీకారం

ప్రీ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు మెరుగైన పోషకాహారం అందివ్వడమే కాకుండా సృజనాత్మకమైన బోధన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక సిలబస్‌ను రూపొందించింది. ఆ దిశగా అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై పర్యవేక్షించేందుకు సచివాలయాల పరిధిలో మహిళా సంరక్షణ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

– నాగేశ్వరమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, గోనెగండ్ల

5,509 ఎకరాల్లో పంటల నమోదు

కృష్ణగిరి: రైతులు సాగు చేసిన పంటలను క్షేత్రస్థాయిలో ఈ–క్రాప్ బుకింగ్ ద్వారా పక్కాగా నమోదు చేస్తున్నామని ఏఓ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. మండలంలో రబీ కింద సాగుచేసిన పంటలను ఇప్పటివరకు 1,819 మంది రైతులకు గాను 5,509 ఎకరాల్లో నమోదు చేసినట్లు వెల్లడించారు. రైతులు సాగుచేసిన పంటలనే నమోదు చేయించుకోవాలని అలా కాకుండా సమస్యలు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఇప్పటివరకు 648 మంది రైతులకు సంబంధించి ఈ-కేవైసీ పూర్తి చేశామని తెలియజేశారు. ఇంకా నమోదు చేసుకోని వారుంటే ఆయా గ్రామాల అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా పంట నమోదు చేయించుకోవాలన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

వెల్దుర్తి: స్థానిక హైవే–44పై చెరుకులపాడు క్రాస్ రోడ్డులో గురువారం ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 23 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. పంచనామా అనంతరం ఆటోను సీజ్ చేసి నిందితులు శివ, చింతలయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆశ్రయించిన వారిని ఆదుకునే 'తిమ్మప్ప స్వామి'

- 11 నుంచి తిమ్మప్ప స్వామి జాతర
- 12న సాయంత్రం రథోత్సవం, రాత్రి పౌరాణిక నాటకం



తిమ్మప్ప మూల విరాట్

మద్దికెర: ఆశ్రయించిన వారిని ఆదుకుంటూ కోరిన కోర్కెలు తీర్చే తిమ్మప్ప స్వామి, యడివళ్ళప్ప స్వామి, దడేధూలప్ప స్వామి వార్ల జాతర ఉత్సవాలను 11 నుంచి నిర్వహించడానికి గ్రామప్రజలు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే రథోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో కొలువైన తిమ్మప్ప స్వామి వార్ల జాతర ఉత్సవాలు రేపటి నుంచి మూడు రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. స్వామి వార్లకు 11వ తేదీ శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, గణపతి పూజ, గంగపూజతో పాటు రాత్రి 6 గంటలకు ఉత్సవంతోపాటు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని గ్రామపెద్దలు తెలిపారు. 12వ తేదీ ఆదివారం సాయంత్రం రథం ముందు హోమం, అశేష జనవాహిని మధ్య స్వామి వారి రథోత్సవం, రాత్రి పంచమాంకముల పౌరాణిక నాటకం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 13వ తేదీ సోమవారం పారువేటతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

భూసర్వే పరిశీలన

ఆలూరు: సమగ్ర భూసర్వేలో భాగంగా రైతులకు సంబంధించిన పొలాల హద్దులను పక్కాగా నమోదు చేయాలని హాలహర్వి తహసీల్దార్ మల్లికార్జున స్వామి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని శ్రీధర్‌హాల్, ఎం.కే పల్లి, టి.చాకిబండ గ్రామాల్లో భూసర్వేను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ఆయా భూములకు సంబంధించి పీఓఎల్ఆర్ (ప్యూరిఫైడ్ ల్యాండ్ రెవెన్యూ రికార్డు) తేల్చాలన్నారు. భూసర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీఆర్వోలు, సర్వేయర్లు, వీఆర్ఏలు ఉన్నారు.

రీసర్వే పక్కాగా చేపట్టండి

మద్దికెర: భూసమస్యలు తలెత్తకుండా చేపట్టిన రీసర్వే పక్కాగా నిర్వహించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాలలో జరుగుతున్న సర్వే పనులు పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు ప్రభుత్వ రికార్డులను పరిశీలించి నివేదికలు పక్కాగా తయారు చేయాలన్నారు.

ఘనంగా దస్తగిరిస్వామి ఉరుసు

తుగ్గలి : మండల పరిధిలోని పెండేకల్లు ఆర్ఎస్‌లో వెలసిన దస్తగిరి స్వామి ఉరుసు ఉత్సవాలను గురువారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం గ్రామస్తులు దర్గాకు వెళ్లి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దర్గాను విద్యుదీపాలతో అలంకరించారు. ముజావర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

14 నుంచి దేవర

కృష్ణగిరి: మండల పరిధిలోని ఆలంకొండ గ్రామంలో ఈనెల 14, 15 తేదీల్లో పెద్దమ్మ, సుంకులమ్మ దేవతల దేవర ఉత్సవాలు జరుపుతున్నట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. 14న అమ్మవార్లకు నైవేద్య పూజలు నిర్వహించి, అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించడం జరుగుతుందన్నారు. 15న అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకునే కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని వారు తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

నందవరం: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల విద్యాధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని ముగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు రాస్తున్న ఫార్మెట్ అసెస్మెంట్-3 పరీక్షలను ఎంఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నాయని, విద్యార్థులు బాగా చదివి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని, 8వ తరగతి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్ఎం సంజీవరాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

తుగ్గలి: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల మాతా శిశు మరణాలు నివారించవచ్చని వైద్యాధికారిణి హరిత అన్నారు. గురువారం పగిడిరాయి పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 52 మంది గర్భిణులకు ఆమె వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత ఉన్న వారికి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు చేయించుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణీలకు భోజన సదుపాయం

పత్తికొండ రూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులు, వారి సహాయకులకు గురువారం సేవాదళ్ ఆధ్వర్యంలో భోజన సదుపాయాన్ని కల్పించారు. డాక్టర్ సుజాత భోజనాన్ని వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వార్డు మెంబర్లు నాగరాజు, శివ, ఎంపీటీసీలు దేవరగట్టు లక్ష్మి, నెనావత్ సరోజ, సేవాదల్ సభ్యులు ఉన్నారు.

అంతర్రాష్ట్ర ఖోఖో పోటీల విజేత కడప జట్టు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో శ్రీ రేణుక ఎల్లమ్మ జాతరను పురస్కరించుకుని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, యువనేత ధరణీధర్ రెడ్డి సహకారంతో జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ రాష్ట్ర ఖోఖో పోటీల్లో కడప జట్టు విజేతగా గెలుపొందింది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జట్టుల మధ్య హోరాహోరీగా ఖోఖో పోటీలు జరిగాయి. ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై కడప జట్టు గెలుపొందింది. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్ రెడ్డి కడప జట్టుకు రూ.15 వేలు, ద్వితీయ బహుమతి అనంతపురం జట్టుకు రూ.10 వేలు అందజేశారు. అదేవిధంగా మూడవ, నాల్గవ స్థానాల్లో నిలిచిన ఆత్మకూరు జట్టుకు రూ.5 వేలు, కోసిగి జట్టుకు రూ.3 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ కోశాధికారి ఖలీల్ అహ్మద్, అధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శి నరసింహరాజు, ఆనంద్, ఆర్గనైజర్స్ పీడీ బాలకృష్ణ, కేశవ్, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ, వాలీబాల్ పోటీలు ప్రారంభం

శ్రీ రేణుక ఎల్లమ్మ జాతరను పురస్కరించుకుని కోసిగి బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో రాష్ట్రస్థాయి వాలీబాల్, ఖోఖో పోటీలను శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్ రెడ్డి ప్రారంభించారు. అలాగే కోసిగి వాలీబాల్ జట్టుకు వైఎస్సార్‌సీపీ యువనేత ధరణీధర్ రెడ్డి సహకారంతో క్రీడా దుస్తులను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్ సీపీ మండల నాయకులు నాడుగేని నరసింహులు, మహంతేష్ స్వామి, నాడుగేని నాగరాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వార్షికోత్సవ పూజలు



ఎమ్మిగనూరులో పూజలందుకుంటున్న గాయత్రీ దేవి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని గీతానగర్‌లో వెలసిన శ్రీ గాయత్రీదేవి అమ్మవారి 9వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు.ఏటా నిర్వహించే వేడుకల్లో భాగంగా ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమ పూజ, దంపతులతో హోమం తదితర పూజా కార్యక్రమాలను బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షులు రఘునందన్ స్వామి, అర్చకులు ప్రకాష్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రఘునందన స్వామి మాట్లాడుతూ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సహకారంతో నూతన కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



మారెమ్మ కొండ మంచినీటి ట్యాంకు వద్ద పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో మంచినీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని, అలాగే శుద్ధి చేసిన మంచి నీటిని పట్టణవాసులకు సరఫరా చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని షరాఫ్‌బజార్ సమీపంలోని మారెమ్మకొండ వద్ద 1360 కేఎల్ కెపాసిటీతో ఉన్న రెండు పెద్ద ట్యాంకుల వద్ద మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ట్యాంకుల చుట్టూ మొలిచిన కంపచెట్లు, చెత్త చెదారాన్ని తొలగించే పనులను సిబ్బంది చేపట్టడంతో వాటిని డీఈ మనోహర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఈ రెండు ట్యాంక్‌లను పది రోజులకోసారి శుభ్రపరిచి శుద్ధి చేసిన నీటిని పట్టణంలో మంచినీటి అవసరాల కోసం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని అందిస్తున్నామన్నారు. ట్యాంకును క్రమం తప్పకుండా శుభ్రపరచాలని సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ ఏఈ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, 12వ వార్డు ఇన్‌చార్జ్ షాబుద్దీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు: గుట్టుగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని ఆలూరు సెబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సెబ్ సీఐ ఎర్రవెంకట్, ఎస్ఐ రాజశేఖర్ ఆలూరు పట్టణంలో గురువారం దాడులు నిర్వహించారు. కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఆలూరుకు చెందిన ఈడిగ ఉరుకుంద, కొర్రపాట్టు వరలక్ష్మిని అరెస్ట్ చేసి వారి నుంచి 150 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.6 వేలు ఉంటుందని అధికారులు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. దాడులలో హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య, కానిస్టేబుల్ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి చేయూత

ఎమ్మిగనూరుటౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన స్నేహితుడికి కుటుంబ పోషణ ఇబ్బందిగా మారడంతో మిత్రులు చేయూతనందించారు. పట్టణానికి చెందిన శ్రీనివాసులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కష్టాల్లో ఉండటాన్ని తెలుసుకున్న 10వ తరగతి బ్యాచ్ మిత్రులు మహేష్, లక్ష్మణ్‌సాగర్, మహబుబ్‌బాషా తదితరులు నిత్యావసర సరుకులు, కొంత ఆర్థిక సహాయాన్ని తమ గురువులు రామ్మోహన్‌రావు, విరూపాక్షి చేతుల మీదుగా గురువారం అందించారు. కష్టాల్లో వున్న స్నేహితుడిని ఆదుకోవడం అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. తోటి మిత్రులు చరణ్, సోమశేఖర్, గౌస్, శ్రీను, రాజేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిపై చర్యలు తీసుకోవాలి

హొళగుంద: ఆస్పరి మండలం అట్టేకల్లుకు చెందిన కురువ చాముండేశ్వరి మరణానికి కారణమైన బోయ శ్రీనివాసులుపై కఠిన చర్యలు తీసుకోవాలని మాదాసి, మాదారి కురువ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నాయకులు ఎల్లార్తి దర్గన్న, శేషప్ప, పెద్యాట మల్లయ్య తదితరులు మాట్లాడుతూ ఈ నెల 1న కురువ చాముండేశ్వరి తన పొలంలో పని చేసుకుంటుండగా బోయ శ్రీనివాసులు దుర్మార్గంగా ప్రవర్తించాడన్నారు. ఈ అవమానాన్ని భరించలేక చాముండేశ్వరి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుందన్నారు. ఆమె మృతికి కారణమైన బోయ శ్రీనివాసులుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

దోమల నివారణకు చర్యలు

హొళగుంద: గ్రామంలో ప్రజలు శుభ్రతను పాటిస్తూ దోమల నివారణకు సహకరించాలని హొళగుంద మేజర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ కోరారు. గురువారం రాత్రి ఆయన హొళగుంద వీధుల్లో దోమల నివారణకు పంచాయతీ సిబ్బందితో ఫాగింగ్ చేయించారు. గత మూడు రోజులుగా ముమ్మరంగా ఫాగింగ్ చేపట్టినట్లు సెక్రటరీ తెలిపారు.

మార్లమడికి డబుల్ రోడ్డుకు ప్రతిపాదనలు



సమ్మతగేరి రోడ్డును పరిశీలిస్తున్న పీఆర్ డీఈఈ శ్రీరాములు

హొళగుంద: ఆంధ్రా–కర్ణాటకను కలిపే 4 కి.మీ మార్లమడికి రోడ్డును రెండు లైన్ల రహదారిగా మార్చేందుకు గాను నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు పీఆర్ ఏఈ సోమప్ప తెలిపారు. గురువారం పీఆర్ డీఈఈ శ్రీరాములు మార్లమడికి, సమ్మతగేరి, ఆలూరు–హొళగుంద రోడ్లను పరిశీలించినట్లు ఆయన వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు.. మార్లమడికి రోడ్డుతో పాటు ఆలూరు నుంచి అరికెర క్రాస్ వరకు డబుల్ రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరుకు సంబంధించి అంచనాలు పంపించనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే హొళగుంద– ఆలూరు వయా ఎల్లార్తి రోడ్డులో మరమ్మతు పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే మార్లమడికి రోడ్డు మరమ్మతులకు రూ.2.52 కోట్లు మంజూరై పనులు ఆగిపోయిన సంగతి తెలిసిందే. అయినా ఉన్నతాదికారుల ఆదేశాల మేరకు డబుల్ రోడ్డు ఏర్పాటుకు కొత్త ఎస్టిమేట్‌ను తయారు చేసి పంపిస్తున్నట్లు ఏఈ సోమప్ప తెలిపారు. దాంతో పాటు వేదావతి(హగరి) నదిపై వంతెన ఎత్తు పెంచేందుకు దాదాపు రూ.25 కోట్ల అవసరమని దానికి సంబంధించి ఎస్టిమేట్‌ను వేసి పంపిస్తామన్నారు.

మూడు నెలల్లో సమ్మతగేరి రోడ్డు పూర్తి

ఆర్ధాంతరంగా నిలిచిన సమ్మతగేరి రోడ్డును గురువారం పీఆర్ డీఈఈ శ్రీరాములు, ఏఈ సోమప్ప పరిశీలించారు. రోడ్డు గురించి స్పందనలో కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేశామని, స్పందించిన అధికారులు రోడ్డును పరిశీలించి మూడు నెలల్లో మరమ్మతు పనులు పూర్తి చేయనున్నట్లు పీఆర్ డీఈఈ శ్రీరాములు తెలిపినట్లు గ్రామ సర్పంచ్ శోభ వెల్లడించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం



హొళగుందలో పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హొళగుంద: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. గురువారం హొళగుందలో ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జులు ఎంపీటీసీ మల్లికార్జున, ఎస్కే గిరి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశా, సింగిల్‌విండో చైర్మన్ మల్లికార్జున తదితరులు ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాలు, టీస్టాళ్లు, బస్టాండు, ప్రధాన కూడళ్లలో తిరిగి ఓటు అభ్యర్థించారు. నాయకులు కెంచప్ప, హెబ్బటం ఎంపీటీసీ ఉరుకుందప్ప, మరిమల్ల, రమేష్,వీరేష్,ఆనంద్,భాషాతదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించాలి



నదికైరవాడిలో వరి పంటపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

నందవరం: వరి సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి సూచించారు. గురువారం మండల పరిధిలోని నదికైరవాడి గ్రామంలో వరి పంట సాగుపై క్లస్టర్ స్థాయి 'డాక్టర్ వైఎస్సార్ పొలంబడి' కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. తేమ శాతం, కలుపు మొక్కల తాకిడి, శత్రు, మిత్ర పురుగుల నిష్పత్తి, వరి పైరు పిలకల్లో తేమ శాతంపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. తద్వారా భూ సాంద్రత పెరుగుతుందని, పర్యావరణ పరిరక్షణ మెరుగు పడుతుందని వివరించారు. మండల వ్యవసాయాధికారిణి మఠ్రి స్రవంతి, ఏఈఓలు ప్రభావతి, సురేంద్ర, గ్రామ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు



ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన పంచముఖి గాయత్రీ మాత 20వ ఆరాధనోత్సవాల సందర్భంగా రెండవ రోజు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుడు అనిల్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి గంగ, ఆకుపూజ, గణపతి హోమం, చండీ పారాయణం, పల్లకి సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు రూపామోహన్ శర్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వాసాపురం వేంకటేశ్వర స్వామికి పూజలు

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదాసమేత వాసాపురం వేంకటేశ్వరస్వామి వారిని కాంగ్రెస్ పార్టీ ఏపీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి, నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీ నరసింహయాదవ్ తదితరులు గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యాక్రమాలు ముగియగానే నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం శాలువా, పూలమాలలతో సత్కరించి స్వామి అమ్మవార్ల జ్ఞాపికలను అందజేశారు.